# ఒక్క నెల మెడికల్ బోర్డు పెడితే సరిపోతుందా?

- అన్ ఫిట్ కోసం అప్లయ్ చేసుకున్న 2 వేల మందిని మెడికల్ అన్ ఫిట్ చేయాల్సిందే
- వారి వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు పోరాడుతాం
- అలియాస్ పేర్లతో ఇబ్బంది పడుతున్న కార్మికులకు కూనంనేని అన్యాయం చేస్తున్నరు?
- ఆయన ద్వంద్వ వైఖరిని కచ్చితంగా కార్మికులు గమనిస్తారు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం,హైదరాబాద్: సింగరేణిలో అన్ ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న 2 వేల మందిని అన్ ఫిట్ చేయాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. వారందరి అప్లికేషన్స్ పరిష్కారమయ్యే వరకు ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించాల్సిందేనన్నారు. ఈ అంశానికి సంబంధించి హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, మాజీ మంత్రి బోడ జనార్ధన్ తో కలిసి బుధవారం వీడియో మెసేజ్ విడుదల చేశారు. గత నెలలో హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ హెచ్చరికలతో ప్రభుత్వం దిగి వచ్చి మెడికల్ బోర్డు నిర్వహించిందన్నారు. కానీ ఒక్క నెలకు మాత్రమే దాన్ని పరిమితం చేయటం సరికాదని కవిత అన్నారు. అన్ ఫిట్ కోసం అప్లయ్ చేసుకున్న 2 వేల మంది అప్లికేషన్లు పరిష్కారమయ్యే వరకు ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించాల్సిందేనని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు కోసం తాము నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరించిన కారణంగానే మెడికల్ బోర్డు ఏర్పాటు చేశారని కవిత చెప్పారు. ఒక్క నెల మాత్రమే మెడికల్ బోర్డు పెట్టి ఆ తర్వాత మళ్లీ కార్మికులను ఇబ్బంది పెడతామంటే ఊరుకునేది లేదని అప్పుడే తాము హెచ్చరించామన్నారు. కానీ ప్రభుత్వం కార్మికులను మోసం చేసే విధంగా అలాంటి పనులే చేస్తోందని మండిపడ్డారు. వెంటనే మెడికల్ బోర్డు పెట్టాలని కోరారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కార్మికులకు అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని కవిత హెచ్చరించారు.

**కార్మికులకు కూనంనేని అన్యాయం చేస్తున్నారు**

అలియాస్ పేర్ల అంశంలో ఉద్యోగాలు రాక ఇబ్బంది పడుతున్న యువమిత్రులకు కూనంనేని సాంబశివరావు అన్యాయం చేస్తున్నారని కవిత మండిపడ్డారు. ఉద్యోగాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న వారికి ఎలాంటి హామీ ఇవ్వకుండా ఎలా దీక్ష విరమింపజేస్తారని ప్రశ్నించారు. గతంలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం అన్ని యూనియన్లు అఫిడవిట్లు ఇస్తే కూనంనేని మాత్రం అఫిడవిట్ ఇవ్వకుండా తప్పించుకున్నారన్నారు. కానీ ఇప్పుడు మాత్రం వారికి ఏదో మేలు చేస్తున్నట్లు నటించటం సరికాదన్నారు. కూనంనేని ద్వంద్వ వైఖరిని కార్మికులు గమనిస్తారని కవిత చెప్పారు. కార్మిక యూనియన్ల హక్కులు కోల్పోయేందుకు కారణమైన వ్యక్తే కూనంనేని అని కవిత విమర్శించారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆయన ప్రభుత్వంతో మాట్లాడి అలియాస్ పేర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఉద్యోగాల కోసం దీక్ష చేపట్టిన యువ మిత్రులకు హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ మద్దతు ఉంటుందన్నారు.

**ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనకు మద్దతు**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఆందోళన బాట పట్టిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కవిత తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు డిమాండ్ చేస్తున్నట్టుగా పీఆర్సీ అమలు చేయాలని కోరారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు, పెండింగ్ లో ఉన్న డీఏలు, హెల్త్ కార్డుల సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలన్నారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లుల చెల్లింపులు, ప్రమోషన్లు, ట్రాన్స్ ఫర్లు సహా అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళన బాట పట్టిన ఉద్యోగులతో ప్రభుత్వం చర్చించాలని కోరారు.

# ప్రతి గడపకూ పాంచజన్య పథకాలను చేర్చాలి

- ప్రతి ఊరికి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప స్ఫూర్తిని తీసుకెళ్లాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత





ఇది కద నిజం,హైదరాబాద్ : ప్రతి ఊరికి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్పాన్ని తీసుకెళ్లాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బుధవారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్ ఛార్జీలు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ, సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం ఆచార్య జయశంకర్ సార్ జయంతిని పురస్కరించుకుని ప్రతిజ్ఞ తీసుకున్నామని తెలిపారు. సామాజిక న్యాయ తెలంగాణ స్ఫూర్తిని ఇప్పుడు ప్రతి గ్రామానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అత్యధిక జనాభా ఉన్న వాళ్లు అట్టడుగున బతకాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది, ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర భారత దేశంలో ఇప్పటికీ సమానత్వం ఎందుకు అందని ద్రాక్షగా మారిందో ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలన్నారు.

సమాజంలో అన్న అసమానతలను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని అన్నారు. మొదటి దశలో అన్ని మండల కేంద్రాలతో పాటు మేజర్ గ్రామ పంచాయతీల్లో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలు నిర్వహిస్తామన్నారు. ఆ తర్వాత ప్రతి గ్రామంలో సభలు నిర్వహిస్తామని తెలిపారు. పార్టీ ప్రధాన ఎజెండా అయిన పాంచజన్య పథకాలను ప్రతి గడపకు చేర్చాలని పిలుపునిచ్చారు. సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సబ్బండ వర్గాల అభివృద్ధి, వికాసం, సాధికారత సాధించిన తెలంగాణగా సుసంపన్నం చేసుకుందామని అన్నారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలో మళ్లీ ఉద్యమించాలని.. అందుకోసం పార్టీ క్యాడర్ సమాయత్తం కావాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మా భూముల ఆక్రమణను అడ్డుకోండి

- గొమ్ముగూడెం నిర్వాసితుల అభ్యర్థన
- డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రం అందజేత



ఇది కద నిజం, కుక్కునూరు: పోలవరం ముంపునకు గురయ్యే గిరిజనులకు భూమి ఇచ్చేందుకు ముందుకు వచ్చినా.. గిరిజనులు వాటిని ఆక్రమించుకుంటున్నారని గొమ్ముగూడెం గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం వారంతా కుక్కునూరు డిప్యూటీ తహశీల్దార్ రమేశ్ బాబుకు ఓ వినతిపత్రం అందజేశారు. పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలో ముంపులో ఉన్న తాము వ్యక్తిగత, ఇళ్ల పరిహారం అందుకున్నామని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలకు వెళ్లే ముందు ఎన్నో ఏళ్ళ నుంచి సాగు చేస్తున్న తమ మిగులు భూములను కూడా ప్రభుత్వానికి అప్పగించడానికి సిద్ధంగా ఉన్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక గిరిజనులు కొందరు ఆ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని అందులో ఆరోపించారు. కాగా, మండలంలోని గొమ్ముగూడెం నిర్వాసితులకు గతంలోనే పోలవరం పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించింది. వారం రోజుల క్రితం ఆర్వపల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 260 ఎకరాల భూమికి సంబంధించిన పోలవరం ముంపు మండలాల్లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాల్లోని గిరిజనులకు భూమికి భూమి ఇచ్చేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో తమ భూములను ప్రభుత్వానికి అప్పగించకుండా కొందరు గిరిజనులు అడ్డుకుంటున్నారని, ఈ విషయంలో అధికారులు విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని గొమ్ముగూడెం నిర్వాసితులు కోరుకుంటున్నారు.

# సౌదీ జైలులో నిజామాబాద్ యువకుడు

- రూ. 84 లక్షల జరిమానా చెల్లించలేక అవస్థలు
- కట్టలేనంత భారీ జరిమానా పడటంతో అక్కడే బంధీ
- ఆ జరిమానా చెల్లించడం ఆ కుటుంబానికి అసాధ్యం
- దిక్కుతోచని స్థితిలో దివ్యాంగ భార్య, చిన్నారి కుమారుడు
- ప్రభుత్వం చొరవ చూపి శ్రవణ్‌ను స్వదేశానికి రప్పించాలని కుటుంబ సభ్యుల విజ్ఞప్తి



ఇది కద నిజం,సాలూరు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: పొట్టకూటి కోసం ఏడారి దేశం వెళ్లిన ఒక నిరుపేద యువకుడు ఊహించని రోడ్డు ప్రమాద కేసులో చిక్కుకుని, విదేశీ గడ్డపై జైలు జీవితం గడుపుతున్నాడు. నిజామాబాద్ జిల్లా సాలూరు మండలం కుమాన్ పల్లి గ్రామానికి చెందిన కుమ్మరి రామయ్య, రాజమణి దంపతుల కుమారుడు శ్రవణ్ కుమార్ కుటుంబ పోషణ నిమిత్తం సౌదీ అరేబియాకు వెళ్లి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ అనుకోకుండా జరిగిన ఒక రోడ్డు ప్రమాద కేసులో శ్రవణ్ కుమార్‌ను సౌదీ పోలీసులు అరెస్ట్ చేసి రియాద్‌లోని జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ అనంతరం సౌదీ కోర్టు శ్రవణ్ కుమార్‌కు భారత కరెన్సీలో సుమారు రూ. 84 లక్షల భారీ జరిమానా విధించింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ నిరుపేద కుటుంబానికి అంతటి భారీ మొత్తాన్ని చెల్లించడం అసాధ్యంగా మారింది. కోర్టు విధించిన జరిమానాను చెల్లించలేక, విడుదలయ్యే మార్గం లేక శ్రవణ్ కుమార్ గడిచిన కొన్ని రోజులుగా అక్కడే జైలులో మగ్గుతున్నాడు. మరోవైపు శ్రవణ్ కుమార్ భార్య దివ్యాంగురాలు కావడంతో పాటు వారి ఐదేళ్ల లోపు చిన్నారి కుమారుడి బాధ్యతలు కూడా ఆమెపైనే పడ్డాయి. ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న శ్రవణ్ కుమార్ విదేశీ జైలులో బంధీ కావడంతో ఆ కుటుంబం ఆర్థికంగా, మానసికంగా తీవ్రమైన కష్టాల్లో కూరుకుపోయింది. ప్రస్తుతం వారు పూట గడవడమే గగనంగా మారిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

**ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు**

ఈ దయనీయమైన పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని శ్రవణ్ కుమార్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు మరియు కుమాన్ పల్లి గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేస్తున్నారు. భారత రాయబార కార్యాలయంతో మాట్లాడి, అవసరమైన చట్టపరమైన సాయాన్ని అందించి, జరిమానా మినహాయింపు లేదా చెల్లింపులో చొరవ చూపి శ్రవణ్ కుమార్‌ను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని కన్నీళ్లతో వేడుకుంటున్నారు.

# వెలుగురు వద్ద లెవల్ క్రాసింగ్ పరిశీలన

## ఆర్ఓబీ నిర్మాణానికి జాయింట్ ఇన్స్పెక్షన్



ఇది కద నిజం,సంగెం, ఆగస్టు 19: దక్షిణ మధ్య రైల్వే సంస్థ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా కీలక నిర్ణయం తీసుకుంది. రైల్వే లైన్ల విస్తరణలో భాగంగా ప్రమాదాలు నివారించడానికి, రవాణాను సులభతరం చేయడానికి లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జ్, రోడ్డు అండర్ బ్రిడ్జ్ , ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా సంగెం మండలం పరిధిలోని వేలుగురు – నెక్కొండ స్టేషన్ల మధ్య ఉన్న రాజ.69 వెలుగురు లెవెల్ క్రాసింగ్ (కి.మీ 397/24-26) వద్ద ప్రతిపాదిత రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు వివిధ శాఖల అధికారులతో కలిసి సంయుక్త తనిఖీ నిర్వహించారు. భూ సేకరణ ప్రక్రియకు సంబంధించి ఆర్ అండ్ బి, అటవీ శాఖ, నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఈ ఇన్స్పెక్షన్ లో పాల్గొని క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ తనిఖీలో భాగంగా బ్రిడ్జి నిర్మాణం వల్ల నష్టపోయే ఆస్తులు, భూముల వివరాలను అధికారులు నమోదు చేసుకున్నారు. అలాగే ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయడానికి తగిన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుందర్, రైల్వే రోడ్ సెక్టార్ ప్రాజెక్ట్ భూ సేకరణ నిపుణులు పి. దేవరాజు, సంగెం తహసీల్దార్ జి. రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచ్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# 187వ అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం : మండల కేంద్రంలో ఫోటోగ్రఫీ అసోసియేషన్ ఆదేశాల మేరకు బుధవారం మండల ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 187వ అంతర్జాతీయ ఫోటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రపు నవీన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం లూయిస్ మండే డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో ప్రతి ఒక్కరి చేతిలో కెమెరా అందుబాటులోకి వచ్చింది అని అన్నారు. నిన్నటి జ్ఞాపకాలను పదిలపరుస్తూ, నేటి వాస్తవాలను ప్రపంచానికి చూపిస్తూ, రేపటి చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచే చిత్రాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫోటో గ్రాఫర్స్ కి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం పిట్లం మండల సీనియర్ ఫోటోగ్రాఫర్స్ రమేష్ శివ హన్మాండ్లు, తమలి లక్షణ్, గుర్రపు విఠల్, కంభపురం నర్సాగౌడ్, సభ్యులు గుర్రపు నవీన్, ద్యావలా శ్రీనివాస్. జాన్,,మధు, నవీన్, హన్మాండ్లు, లాలు, పవన్ కళ్యాణ్, సిద్దు,శ్రీనివాస్, రమేష్, వడ్ల నవీన్ కుమార్, గంగారాం, జావీద్, తదితరులు పాల్గొన్నారు ఫోటో & వీడియో గ్రాఫర్స్ పాల్గొన్నారు.

# పాఠశాల ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం- పెద్ద రాంపూర్





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్ద రాంపూర్ లో ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమావేశం నిర్వహించినట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీలత తెలిపారు. పాఠశాలల వారీగా అమలవుతున్న విద్యా పథకాల పై , పిల్లల ప్రగతి, పాఠశాలల వారీగా రివ్యూ నిర్వహించడం జరిగింది. వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు, ఫార్మేటివ్ వన్ మార్కులను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు, F.L.N. ప్రారంభ పరీక్షలో వెనుకబడిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మధ్యంతర ( మిడ్ లైన్ టెస్ట్ ) పరీక్షలో ప్రగతి మరియు శాతం మెరుగుపరిచే విధంగా చూడాలని సూచించారు. పాఠశాలలో నమోదై ఉన్న పిల్లల సంఖ్య యుడైస్ ఆన్లైన్ లో నమోదు అయి వున్న సంఖ్య సరి సమానంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు ఆ ప్రాంత సి. ఆర్. పి. తదితరులు పాల్గొన్నారు

# సెంట్రల్ యూనివర్సిటీకి బొర్నాపూర్ విద్యార్థి ఎంపిక

**ఆంత్రోపాలజీ ప్రవేశ పరీక్షలో 72 శాతం మార్కులు సాధించి ప్రతిభ**



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం బొర్నాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి సెంట్రల్ యూనివర్సిటీకి ఎంపికై ప్రతిభ చాటారు. ఆంత్రోపాలజీ విభాగంలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో 72 శాతం మార్కులు సాధించి ఉన్నత విద్యకు ఎంపికయ్యారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రతిభతో సెంట్రల్ యూనివర్సిటీలో సీటు సాధించడం పట్ల బొర్నాపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

